క్లుప్తంగా

చాపాడు సీడీపీఓపై చర్యలు తీసుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్ : అంగన్వాడీ టీచర్ గా పని చేస్తున్న శ్రావణిని ఫేక్ రిపోర్టు ఇచ్చి మెమోల పేరుతో మానసికంగా, రాజకీయ కక్ష సాధింపుల ధోరణితో ఇబ్బందులు గురిచేస్తున్న చాపాడు సీడీపీఓపై చర్యలు తీసుకోవాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్ కోరారు. సోమవారం ఈ మేరకు జేసీకి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పుడు రిపోర్ట్ ఇచ్చిన చాపాడు సీడీపీఓపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అన్నదానం



ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదానం చేస్తున్న దాతలు

కడప అర్బన్: ఓంశాంతి నగర్‌కు చెందిన కదిరి కిషోర్ కుమార్, కదిరి శ్రీవిద్య కుమారుడు కదిరి జశ్విత్ జన్మదిన సందర్భంగా సోమవారం హిమ వర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, రెడ్డి లక్ష్మణ్, గుండ్లకొండ శ్రీ చరణ్, దామోదర్, ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాస్ రెడ్డి, దాతలు పాల్గొన్నారు.

అమ్మ ఒడి అనాథ నిలయంలో..



అనాథ బాలలకు భోజన ప్యాకెట్లను అందిస్తున్న కనకమ్మ

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప నగరంలోని మా అమ్మఒడి అనాథ బాలల ఆనంద నిలయంలోని బాలురకు ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పోలీసు కానిస్టేబుల్ లక్ష్మన జ్ఞాపకార్థం భార్య కనకమ్మ, కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు నాగమణి, సంగీతలక్ష్మి, విజయ భాస్కర్, మహదేవ్ పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు



కడప నగరంలో పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తు

కడప అర్బన్: జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రారంభమైన పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ప్రత్యేక పోలీసు బృందాలచే పరీక్షా కేంద్రాల వద్ద పెట్రోలింగ్ చేపట్టారు. పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లే విద్యార్థులు సెల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు.

వినియోగదారుల రక్షణ చట్టం పుస్తకం ఆవిష్కరణ

కడప కార్పొరేషన్: వినియోగదారుల రక్షణ చట్టం-2019 పుస్తకాన్ని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ ఆవిష్కరించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ స్టేట్ కో ఆర్డినేటర్ ఎం. సురేష్ బాబు, జిల్లా ఛైర్మెన్ కిశోర్, వైస్ ఛైర్మెన్ ఉమామహేశ్వర రావు, సెక్రటరీలు రాధాక్రిష్ణ, చలపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారులు ప్రతిరోజూ ఎన్నో వస్తువులను కొనుగోలు చేస్తూ కొన్నిసార్లు మోసపోతుంటారన్నారు. అలా మోసపోయినప్పుడు వారికి రావాల్సిన నష్ట పరిహారం చాలా సులభంగా, వేగంగా అందించేందుకే వినియోగదారుల రక్షణ చట్టం ఏర్పడిందన్నారు. వినియోగదారులు వస్తువును కొని నష్టపోతే తాను సొంతంగా వినియోగదారుల ఫోరంలో కేసు వేసుకునే వెసులుబాటు ఉందన్నారు. డిస్ట్రిక్ట్ కమిషన్ ఫోరమ్ లో రూ. 20 లక్షల వరకు, స్టేట్ కమిషన్ ఫోరమ్ లో రూ.20 లక్షల నుండి రూ.కోటి వరకు, నేషనల్ కమిషన్ ఫోరమ్ లో రూ.కోటి నుండి రూ.10 కోట్ల వరకూ నష్టపరిహారం పొందేందుకు అవకాశం ఉందన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

వీరపునాయునిపల్లె: వీరపునాయునిపల్లె మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని సోమవారం మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగభూషణ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రమేష్ బాబు, మహిళా విభాగం అధ్యక్షురాలుగా మస్తాని, కోశాధికారి రాజేష్, జనరల్ సెక్రటరీగా నరేంద్ర, జాయింట్ సెక్రటరీగా పవన్ కుమార్ రెడ్డి, గౌరవ సలహాదారుడిగా లక్ష్మి కాంత్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ప్రసాద్, నవీన్ బాషా, హరికృష్ణ, విజయ్‌భాస్కర్, శివ చంద్రికను ఎన్నుకున్నారు.

అపరిష్కార వేదిక

– ప్రజల నమ్మకం కోల్పోతున్న గ్రీవెన్స్ సెల్
– రాను రాను తగ్గిపోతున్న అర్జీదారుల సంఖ్య



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ / కడప సెవెన్ రోడ్స్: ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కడప నగరపాలక సంస్థలో ప్రతి సోమవారం ఏర్పాటు చేస్తున్న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ప్రజల నమ్మకం కోల్పోతోంది. అపరిష్కార వేదికగా మారిన ఆ కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువవుతోంది. కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి రోడ్లు, కాలువలు, డ్రైనేజీ, రోడ్డు ఆక్రమణలు, చెత్తచెదారం సమస్యలు, ఇంటి పన్నులు, పేర్ల మార్పు వంటి సమస్యలు వస్తుంటాయి. ఈ కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన అర్జీలను ఆయా విభాగాల అధికారులు పరిశీలించి సకాలంలో పరిష్కారం చేయాల్సి ఉంటుంది. కాగా అధికారులు చెత్త, కాలువలు వంటి సమస్యలు మినహా రోడ్లు, కాలువల నిర్మాణం వంటివి పరిష్కారం కాలేదన్న విమర్శలు ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐఏఎస్ అధికారి కమిషనర్‌గా ఉన్నప్పుడు 'స్పందన' 'జగనన్నకు చెబుదాం' వంటి పేర్లతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రతి సోమవారం 60-70 అర్జీలు వచ్చేవి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఏడాది జనవరి నుంచి పరిశీలిస్తే ఒక్కసారి కూడా 30కి మించి అర్జీలు రాలేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రజా సమస్యలపై అధికారులు శ్రద్ధ చూపకపోవడం వల్లనే ప్రజలు ఈ కార్యక్రమం పట్ల అంత ఆసక్తి చూపడం లేదని విమర్శలున్నాయి. ఇదిలా ఉండగా అధికారులు మాత్రం వచ్చిన అర్జీలన్నీ పరిష్కారం చేసినట్లు ఆన్‌లైన్‌లో చూపుతుండటం గమనార్హం.

గ్రీవెన్స్ సెల్ వివరాలు..

తేది	వచ్చిన అర్జీలు	పరిష్కార మైనవి
జనవరి-6	27	27
జనవరి-20	18	18
జవవరి-27	22	22
ఫిబ్రవరి-10	24	24
ఫిబ్రవరి-17	27	27
ఫిబ్రవరి- 24	28	28
మార్చి- 3	33	33
మార్చి-10	28	28
మార్చి- 17	28	

ఎన్ని అర్జీలు వచ్చినా.. అన్ని పరిష్కారమైనట్లు అధికారులు ఆన్‌లైన్‌లో చూపుతున్నారు. వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉండడం గమనార్హం.

నా ఇంటి ముందు గోడకట్టారు



కడప నగరంలోని యానాది కాలనీలో డోర్ నంబర్-10/252-1 ఎదురుగా కార్పొరేషన్ అధికారులు రోడ్డు స్థలంలో ప్రహరీ నిర్మించారు. దీనివల్ల మేము ఇంటిలోంచి బయటికి రాలేని పరిస్థితి ఏర్పడింది. రోడ్డు స్థలంలో రోడ్డు నిర్మించకుండా...గోడ కట్టడమేమిటి. దీనిపై కార్పొరేషన్‌లో ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదు. కోర్టులోనే తేల్చుకో...పో అని నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు.
– షకీల్‌బాషా, యానాది కాలనీ, కడప

వరదనీటి కాలువ నిర్మాణాన్ని పూర్తి చేయాలి



నగరంలోని 14వ డివిజన్ ప్రకాష్ నగర్‌లో వరదనీరు పోయేందుకు కాలువ నిర్మాణం ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. కాలువలో కడ్డీలు పెట్టి వదిలేయడం వల్ల పిల్లలు, పెద్దలు ఎవరైనా అందులో పడితే ప్రాణాలకే ప్రమాదం. అలాగే ప్రకాష్ నగర్ మెయిన్ రోడ్డులో వీధి దీపాలు ఒకవైపునే ఉన్నాయి. డివైడర్లు నిర్మించి రోడ్డు మధ్యలో వీధి దీపాలు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరక్కుండా ఉంటాయి. – కె. బాబు, కార్పొరేటర్, 14వ డివిజన్

వేర్వేరు కొళాయి కనెక్షన్లు ఇవ్వాలి



మాది రూకవారిపల్లె గ్రామం, మేము ముగ్గురం అన్నదమ్ములం కాగా ఇంటిని మూడు భాగాలు ఏర్పాటు చేసుకొన్నాం. మొదట్లో వారికి నా కొళాయి కనెక్షన్ నుంచే వారికి కూడా కొళాయిలు ఏర్పాటు చేశాము. వారు మోటార్లతో నీటిని తోడేయడం వల్ల మాకు నీరు రావడం లేదు. వారికి ప్రత్యేకంగా కొళాయిలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. – ఓబుల్‌రెడ్డి, రూకవారిపల్లె

కేటాయించిన భూమి అప్పగించాలి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో యాదవ భవన్ నిర్మాణం కోసం కడప నగరం పుట్లంపల్లెలో 2023 ఏప్రిల్ 17వ తేదీ భూమి కేటాయించారు. సర్వే నెంబరు 155/1లో 83 సెంట్లు, 184/1లో 83 సెంట్లు వెరసి ఎకరా 66 సెంట్లు మంజూరు చేశారు. ఫీజుబులిటీ రిపోర్టు కూడా గతంలోనే ఇచ్చారు. అయితే ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండుసార్లు విచారణ సైతం నిర్వహించారు. కానీ కేటాయించిన స్థలాన్ని మాకు అప్పగించలేదు. ఈ విషయంపై కలెక్టర్ కార్యాలయంలో సంప్రదించగా, తహసీల్దార్‌కు ఆదేశాలు ఇచ్చామంటున్నారు. కానీ తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదిస్తే తమకు ఎలాంటి ఆదేశాలు లేవని బదులిస్తున్నారు. కేటాయించిన స్థలాన్ని అప్పగించకుండా నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు. – గంగాదారి నారాయణ యాదవ్, కడప

దగ్గరలో ఇంటి స్థలాన్ని కేటాయించాలి



నేను వికలాంగురాలిని. బోయ కులానికి చెందిన దానిని. గత ప్రభుత్వంలో నా పేరు మీద ఇంటి స్థలం మంజూరు చేశారు. ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేశారు. దాన్ని రద్దు పరిచి తాను వికలాంగురాలిని గనుక దగ్గరలో ఎక్కడైనా స్థలం మంజూరు చేయాలని కోరుతున్నాను. నాకు ఇచ్చిన ప్రదేశం మామిళ్లపల్లె వద్ద కొండ కింద ఉంది. నేను అంత దూరం పోవడానికి వీలు లేనందున ఉన్నతాధికారులు నాకు దగ్గరలోని నానాపల్లిలో ఇంటి స్థలం మంజూరు చేయాలని కోరుతున్నాను.
– కల్లుట్ల లక్ష్మి, సరోజిని నగర్, కడప

ఆలయాల హస్తకళపై అవగాహన కలిగి ఉండాలి



భైరవకోనలో ఏఎఫ్‌యూ హస్తకళ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: చారిత్రాత్మక ఆలయాల కట్టడాలు, హస్తకళలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ ఉపకులపతి విశ్వనాథకుమార్, రిజిస్ట్రార్ రాజేశ్వర్ కుమార్‌రెడ్డి అన్నారు. ఏఎఫ్‌యూకు చెందిన చిత్రకళ విద్యార్థులు సోమవారం ప్రకాశం జిల్లాలోని భైరవకోన, నెల్లూరు జిల్లా ఉదయగిరి రంగనాయకస్వామి ఆలయం, వీరరాఘవేంద్ర స్వామితోపాటు వనిపెంట హస్తకళ పరిశ్రమలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆలయాల నిర్మాణ శైలి, కళాకారుల పనితీరును పరిశీలించారు. హస్తకళ పరిశ్రమలను, చారిత్రక ఆలయాలను పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. వారసత్వ సంపదను కాపాడుకోవడంలో మనం ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రకళ విభాగ సమన్వయకర్త భురుణ మండల్, అధ్యాపకులు మనోహరరావు, సుజాత, పరమశివం తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళా

కడప ఎడ్యుకేషన్: కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో సోమవారం జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో కంప్యూటర్ డ్రైవ్ నిర్వహించారు. చెన్నైకి చెందిన జెనిత్ ఇంగ్లీష్ అకాడమి ఆఫ్ లాంగ్వేజ్‌కు చెందిన కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. డిగ్రీ, పీజీ చదువుతున్న, పూర్తి చేసిన వివిధ కళాశాలల నుంచి విద్యార్థినీ, విద్యార్థులు ఈ ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 8 మంది విద్యార్థులను కమ్యూనికేషన్ స్కిల్స్ ట్రైనర్స్ ఉద్యోగాలకు ఎంపిక చేశామని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా, జేకేసీ కో ఆర్డినేటర్ సుజిత, జేకేసీ ఎఫ్‌టీఎంలు వరప్రసాద్, మంజుల అభినందించారు.

మల్లేశ్వరస్వామి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే



మల్లేశ్వరస్వామికి పూజలు చేస్తున్న పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి: పొలతల శైవ క్షేత్రంలోని మల్లేశ్వర స్వామి, పార్వతిదేవి అమ్మవార్లను సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పొలతల మాజీ ఛైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు వీరశేఖర్‌రెడ్డి ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. జెడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ రమణారెడ్డి, ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు నాగమల్లారెడ్డి పాల్గొన్నారు.

ఒకే పాఠశాలలో నాలుగు సెంటర్లు ఎలా ఇస్తారు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని కమలాపురంలో ఉన్న ప్రగతి హైస్కూల్లో నాలుగు పరీక్షా కేంద్రాలను నిర్వహిస్తున్నారని వీటిని వెంటనే రద్దు చేయాలని రెవల్యూషనరీ స్టూడెంట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం డీఈఓ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమలాపురంలో అనేక పాఠశాలలు ఉన్నప్పటికీ ప్రగతి స్కూల్‌కు నాలుగు సెంటర్స్‌ను కేటాయించడం వెనక మర్మమేమిటని ప్రశ్నించారు. దీంతోపాటు పెండ్లిమర్రి కేజీబీవీ, ఎల్లటూరుతోపాటు కడపలోని కొన్ని పరీక్షా కేంద్రాలులోపాయికారి ఒప్పందాలు చేసుకున్నాయన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప నగరం 15వ డివిజన్ సరోజినీ నగర్ దగ్గర ఉన్న ఆచార్య కాలనీలో ఇంటి పట్టాలు, ఇళ్ల స్థలాలు భూకబ్జాదారులు అమ్ముకుంటున్నారని, తక్షణమే సమగ్ర విచారణ జరపాలని సోమవారం కడప డిప్యూటీ తహసీల్దార్‌కు సీపీఎం నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్ మాట్లాడుతూ ఆచార్య కాలనీలో గత 30ఏళ్ల క్రితం బడుగు బలహీన వర్గాలకు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్న వారికి, క్రిస్టియన్, మైనార్టీ వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని, ఇప్పుడు వాటిని కొంతమంది బినామీ పేర్లతో దొంగ పట్టాలు సృష్టించి అమ్ముకుంటున్నారని, దీనిపై మండల తహసిల్దార్, రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ జరిపి భూకబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. కొంతమంది రెవెన్యూ అధికారులు భూకబ్జాదారులకు వత్తాసు పలకడంతో గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ పేరుతో దొంగ పట్టాలు సృష్టించి ఆచార్య కాలనీలో భూ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆయన తెలిపారు. ఈ సమస్యపై విచారణ జరపాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, నగర కమిటీ సభ్యులు కుమారస్వామి రెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

పది పరీక్షల వేళ..



గాయాన్ని లెక్క చేయకుండా పరీక్షకు వస్తున్న విద్యార్థి



నగరంలోని ఓ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ షంషుద్దీన్



పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు సూచనలు ఇస్తున్న పోలీసు, పరీక్ష సిబ్బంది

పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభం అయ్యాయి. చాలా మంది విద్యార్థులు తమ తల్లిదండ్రులను వెంటబెట్టుకుని పరీక్షా కేంద్రాలకు తరలివచ్చారు. మొదటి పరీక్ష కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలకు ధైర్యం చెబుతూ కేంద్రంలోకి పంపారు. కాగా.. డీఈఓ షంషుద్దీన్ పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. - ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప



పదవ తరగతి పరీక్షలు రాసేందుకు హాజరవుతున్న విద్యార్థులు





విద్యార్థులు పరీక్ష రాస్తుండగా కేంద్రం బయట వేచివున్న తల్లిదండ్రులు

నిరుద్యోగ భృతి ఇవ్వాలని ధర్నా



కడప కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తక్షణమే నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి అందించి ఆదుకోవాలని అఖిలభారత యువజన సమాఖ్య ప్రతినిధులు డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమవారం అఖిలభారత యువజన సమాఖ్య కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో కడప కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి అనంతరం అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తాం, ఉపాధి కల్పిస్తాం,ఉద్యోగాలు లేకపోతే నిరుద్యోగ భృతి 3000 రూపాయలు ఇస్తామని మాయమాటలు చెప్పి నిరుద్యోగుల ఓట్లు దన్నుకొని అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్న నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గమని వారు పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ విడుదల చేసి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటన చేశారన్నారు. దాదాపు రాష్ట్రంలో 28 వేల పైచిలుకు ఉపాధ్యాయ పోస్టులు ఉంటే కేవలం 13647 పోస్టులు మాత్రమే ప్రకటించడం, అవి కూడా వాయిదాలు వేసుకుంటూ కాలయాపన చేయడం సిగ్గుచేటున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు పెద్దులపల్లి ప్రభాకర్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శివ నాగేంద్ర, ఏఐవైఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.